క్లుప్తంగా

1 నుంచి కమిషనరేట్ పరిధిలో నిషేధాజ్ఞలు

సీపీ టీకే రాణా

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లా నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో అక్టోబర్ 1 నుంచి డిసెంబర్ 31వ తేదీ వరకు సెక్షన్ 30 పోలీస్‌యాక్ట్ 1861 ప్రకారం నిషేధాజ్ఞలు అమల్లో ఉంటాయని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్, మెట్రోపాలిటన్ ప్రాంత అదనపు జిల్లా మేజిస్ట్రేట్ టీకే రాణా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా, శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా, అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ముందస్తు భద్రత చర్యల్లో భాగంగా 92 రోజుల పాటు నిషేధాజ్ఞలు అమలులో ఉంటాయని వివరించారు. ఆ సమయంలో కమిషనరేట్ పరిధిలో సభలు, సమావేశాలు, ఊరేగింపులు, నిరసనలు, ధర్నాలను పోలీసుల ముందస్తు అనుమతి లేకుండా నిర్వహించకూడదని, ఎవరైనా అతిక్రమిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

15 నుంచి విజయదుర్గ ఆలయంలో దసరా ఉత్సవాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): భీమనవారిపేటలోని శ్రీ విజయదుర్గ రామలింగేశ్వర స్వామి ఆలయంలో వచ్చే నెల 15 నుంచి 23వ తేదీ వరకు దసరా మహోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు చింతలపాటి వెంకట సుబ్రహ్మణ్య శాస్త్రి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 15వ తేదీ ఉదయం 8.01 గంటలకు గణపతి పూజ, కలశస్థాపన జరుగుతుందని, ఉదయం 11 గంటలకు విశేష కుంకుమార్చన జరుగుతుందని పేర్కొన్నారు. 15వ తేదీ అమ్మవారు శ్రీ బాలాత్రిపుర సుందరిదేవిగా, 16న శ్రీ గాయత్రిదేవి, 17న శ్రీ అన్నపూర్ణాదేవి, 18న శ్రీమహాలక్ష్మీదేవి, 19న శ్రీ లలితా త్రిపుర సుందరీదేవి, 20న మూలా నక్షత్రం శ్రీ సరస్వతిదేవిగా, 21వ తేదీ శ్రీ దుర్గాదేవి, 22న శ్రీమహిషాసురమర్దినిదేవి, 23న రాజరాజేశ్వరిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

నవయుగ కవితా చక్రవర్తికి స్వర నీరాజనం




విజయవాడ కల్చరల్: ప్రణవి మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో నవయుగ కవితా చక్రవర్తి గుర్రం జాషువా 128వ జయంతి, సినీ సంగీత విభావరి కార్యక్రమాన్ని గురువారం గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో నిర్వహించారు. కారుమంచి రాజు మాట్లాడుతూ కవిగా, నాటక రచయితగా జాషువా తెలుగు సాహిత్యానికి చేసిన సేవలు వెలకట్టలేనివన్నారు. నాటి యువకులను ఎందరినో ప్రభావితం చేసినట్లు తెలిపారు. సినీ సంగీత విభావరిలో భాగంగా ఆదిరాల జయప్రభ, రమాశంకర్, కొమ్మినేని రత్నకుమారి, పావని, శ్రావణి,శ్రీనివాసరావు తెలుగు చిత్రగీతాలను ఆలపించారు. నిర్వాహకులు జాషువా చిత్రపటానికి నివాళులర్పించారు.

ఘనంగా అనంత పద్మనాభ స్వామి వ్రతం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చిట్టినగర్‌లోని శ్రీ పద్మావతి గోదాదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో గురువారం అనంతపద్మనాభస్వామిస్వామి వ్రతాన్ని ఆచరించారు. వ్రతంలో పలువురు భక్తులు, ఉభయదాతలు పాల్గొన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు వినుకొండ రామరత్నమాచార్యులు భక్తులతో వ్రతాన్ని చేయించారు. వ్రతం ఆచరిస్తే సకల కార్యాల్లో విజయం సిద్ధిస్తుందని పేర్కొంటూ వ్రత మహాత్మ్యాన్ని భక్తులకు వివరించారు. స్వామి వారికి 14 రకాల పుష్పాలతో విశేష అర్చన, 14 రకాల నైవేద్యాలను నివేదించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ కార్యవర్గ సభ్యులతో పాటు దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

హరిత విప్లవ పితామహుడు స్వామినాథన్



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): హరిత విప్లవ పితామహుడు ఎంఎస్ స్వామినాథన్ మరణం తీరని లోటని రాకేష్ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ ఎన్వీ రావు తెలిపారు. కేఎల్‌రావునగర్‌లోని రాకేష్ పబ్లిక్ స్కూల్ ఆవరణలో గురువారం ఎంఎస్ స్వామినాథన్ చిత్రపటం వద్ద ఉపాధ్యాయులు, విద్యార్థులు నివాళులర్పించారు. ఎన్వీరావు మాట్లాడుతూ వరి, గోధుమ వంగడాలపై స్వామినాథన్ పరిశోధనలు చేశారని, వాటి కారణంగా నేడు ఎన్నో మేలు జాతి వంగడాలు లభిస్తున్నాయని తెలిపారు. పర్యావరణానికి హాని కలిగించని ఉత్పత్తిని సాధించి ఎన్నో అవార్డులు, రివార్డులను అందుకున్నారని వివరించారు. అనంతరం ఆయన జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయిని రేణుకాదేవి, ఉపాధ్యాయులు మల్లీశ్వరి, మమత, సురేఖ, ఝాన్సీ, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గణేష్ నిమజ్జనాలు



పూలబావి వీధిలోని భారీ గణనాథుడు



బాణసంచాతో విన్యాసాలు

కృష్ణమ్మ ఒడికి చేరుకున్న భారీ గణపతులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలో గణేష్ నిమజ్జనాలు గురువారం ఘనంగా జరిగాయి. రెండు రోజులుగా భారీ విగ్రహాలన్నీ కృష్ణమ్మ ఒడికి చేరుకుంటున్నాయి. పాతబస్తీలోని వివిధ ప్రముఖ సంస్థలకు చెందిన విగ్రహాల ఊరేగింపులను ఆయా నిర్వాహకులు భారీగా నిర్వహించారు. మంగళ వాయిద్యాలు, డప్పుల విన్యాసాలు, రాష్ట్రంతో పాటుగా వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన జానపద కళాకారుల ప్రదర్శనలతో, చిత్ర విచిత్ర వేషధారణలతో స్వామి వారి నిమజ్జన ఊరేగింపులు ముందుకు సాగాయి. క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ (వస్త్రలత) ఆధ్వర్యంలో వ్యాపార సముదాయంలో ఉంచిన రెండు విగ్రహాలను భారీ వాహనాలపై అధిష్టింపజేసి ఊరేగించారు. తమిళనాడు, కేరళ నుంచి కళాకారులు ప్రదర్శనలు ఇచ్చారు. గణేష్ ఉత్సవ సమితి (మార్వాడీ సంఘం) ఆధ్వర్యంలోనూ భారీ ఊరేగింపుగా స్వామి వారిని నిమజ్జనానికి తరలించారు. ఐదు దశాబ్దాల నుంచి ఉత్సవాలను నిర్వహిస్తున్న ఉమాపుత్ర సేవా సమితి నిర్వాహకులు స్వామి వారిని నిమజ్జనానికి వైభవంగా తరలించారు. రాయల్ హోటల్ సెంటర్‌లోని మిత్ర బృందం తమ గణపతిని నిమజ్జనానికి అంగరంగ వైభవంగా తరలించారు. మెయిన్‌బజార్‌లోని వివిధ సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలు సైతం నిమజ్జనానికి ఊరేగింపుగా తరలించారు.



నిమజ్జన ప్రదర్శనలో కళాకారుడు



వస్త్రలత గణపతి ఊరేగింపు

భూ హక్కు పత్రాల పంపిణీ వేగవంతం

కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జిల్లాలో రెండో దశ రీ సర్వే ప్రక్రియలో భూహక్కు పత్రాలను పెండింగ్ లేకుండా పంపిణీ చేస్తున్నామని, జగనన్నకు చెబుదాం– 1902లో నమోదవుతున్న అర్జీలకు గడువులోగా పరిష్కారం చూపుతున్నామని కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్. జవహర్ రెడ్డికి వివరించారు. గురువారం రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి కె.ఎస్. జవహర్‌రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నగరంలోని కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ జిల్లాలో మొదటి దశలో 14 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేశామన్నారు. ఆయా గ్రామాల్లో స్టోన్ ప్లాంటేషన్, భూ హక్కు పత్రాల పంపిణీ పూర్తి చేస్తున్నామన్నారు. రెండవ దశలో 15 గ్రామాల్లో రీ సర్వేలో స్టోన్ ప్లాంటేషన్ ప్రక్రియలో భాగంగా 12,968 సరిహద్దు రాళ్లు పాతడం లక్ష్యమని ఇప్పటికే ఏడు గ్రామాల్లో 8,638 సరిహద్దు రాళ్లను నాటే ప్రక్రియ పూర్తి చేశామన్నారు. మూడో దశ రీ సర్వేలో భాగంగా జిల్లాలోని 100 గ్రామాల్లో గ్రౌండ్ టూతింగ్ వ్యాలిడేషన్ ప్రక్రియను పూర్తి చేసి నిర్దేశించిన ఈ ఏడాది డిసెంబర్ 31వ తేదీ నాటికి పూర్తి చేసేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. జగనన్నకు చెబుదాంలో పరిష్కరించిన అర్జీల వివరాలు తెలియజేశారు. స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా సెప్టెంబర్ 15వ తేది నుంచి అక్టోబర్ 2వ తేది వరకు చెత్త రహిత భారత్‌లో భాగంగా వ్యర్థాల నిర్వహణను చేపట్టామన్నారు. వీసీలో జాయింట్ కలెక్టర్ సంపత్ కుమార్, డ్వామా పీడీ జె. సునీత, పంచాయతీరాజ్ ఈఈ కె. వెంకటేశ్వరావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎస్ నాగమణిమ్మ, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

పోరాట యోధుడు భగత్‌సింగ్

కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): స్వాతంత్య్రం కోసం అలుపెరగని పోరాటం చేసిన యోధుడు భగత్‌సింగ్ అని కలెక్టర్ ఢిల్లీరావు అన్నారు. గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో భగత్‌సింగ్ జయంతి ఘనంగా నిర్వహించారు. తొలుత భగత్ సింగ్ చిత్రపటానికి కలెక్టర్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బ్రిటీష్ పాలననుంచి దేశ విముక్తి కోసం ప్రాణాలను తృణప్రాయంగా ఎంచి ఉరికంబమెక్కిన ఆయన త్యాగనిరతి మరువలేనిదన్నారు. నేటి యువత భగత్‌సింగ్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని తెలిపారు.

యువతకు స్ఫూర్తి

విద్యాధరపురం(విజయవాడపశ్చిమ): సర్దార్ భగత్‌సింగ్ యువతకు స్ఫూర్తి అని సీపీఐ నగర కార్యదర్శి వర్గ సభ్యుడు తాడి పైడియ్య పేర్కొన్నారు. 49వ డివిజన్ గున్నాబత్తుల అచ్చయ్య వీధిలోని ప్రగతి విజ్ఞాన సమితి వద్ద నిర్వహించిన భగత్‌సింగ్ జయంతి వేడుకల్లో పైడియ్య భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నగర కార్యదర్శి వర్గ సభ్యుడు భార్గవ్, 49వ డివిజన్ సీపీఐ కార్యదర్శి బోరా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

- స్థానిక విద్యాధరపురం ఎంసీపీఐ(యూ) కార్యాలయంలో జరిగిన భగత్‌సింగ్ జయంతి కార్యక్రమంలో భారత ఐక్య యువజన సమాఖ్య (యూఐఎఫ్‌ఐ) రాష్ట్ర కన్వీనర్ కాసాని గణేష్‌బాబు.. భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో యూఐఎఫ్‌ఐ నాయకులు అనకాపల్లి కనకరాజు, కంకిపాటి అనిల్‌కుమార్, సుజాత, జైపాల్, జోజి తదితరులు పాల్గొన్నారు.

భవానీపురం(విజయవాడపశ్చిమ): భగత్‌సింగ్ చిరస్మరణీయుడని సీపీఐ నగర కార్యదర్శి కోటేశ్వరరావు అన్నారు. సర్దార్ భగత్‌సింగ్ జయంతి సందర్భంగా విద్యాధరపురం కుమ్మరిపాలెం సెంటర్‌లోని కొరగంజి శేఖర్‌బాబు కార్యాలయం వద్ద 38వ డివిజన్ ఏఐవైఎఫ్ కార్యదర్శి వెంకటేశ్వరరావు అధ్యక్షతన గురువారం కార్యక్రమం జరిగింది. తొలుత ఏఐవైఎఫ్ పతకాన్ని నగర అధ్యక్షులు కంచర్ల భార్గవ్ ఆవిష్కరించారు. నేతలు పంచదార్ల విశాల్, ఆర్.రాంబాబు, ఓంకార్, వెంకటేష్ పాల్గొన్నారు.



భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు



49వ డివిజన్‌లో భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నేత పైడియ్య

నేత్రపర్వంగా గణపతి నగరోత్సవాలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని ఆలయాల్లో కొలువై ఉన్న గణనాథుల నగరోత్సవాలు గురువారం నేత్రపర్వంగా కొనసాగాయి. ఆలయాల్లో జరుగుతున్న స్వామి వారి ఉత్సవాల్లో భాగంగా గురువారం ఉత్సవమూర్తులను అంగరంగ వైభవంగా అలంకరించిన వాహనాలపై పాతబస్తీలో ఊరేగించారు. కెనాల్‌రోడ్డులోని శ్రీ వినాయకస్వామి దేవస్థానంలో స్వామి వారి ఉత్సవమూర్తికి నగరోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అందులో భాగంగా భేతాళ నృత్యాలను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు పొట్టి శ్రీహరి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. పూజారి వారి వీధిలోని శ్రీ బాలగణపతి ఆలయం స్వామి వారు సైతం గురువారం నగరోత్సవంలో ఊరేగారు. నగరోత్సవాన్ని పురస్కరించుకొని వివిధ జానపద కళారూపాలతో కళాకారులు అలరించారు. కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గ్రంధి శ్రీనివాసరావు, మామిడి వెంకటకృష్ణారావు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.



బాలగణపతి నగరోత్సవం



భర్త అదృశ్యం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): భర్త అదృశ్యంపై భార్య ఫిర్యాదు మేరకు కొత్తపేట పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గొల్లపాలెంగట్టు సాయిబాబా గుడి ప్రాంతానికి చెందిన మొక్క ఆయేషా, శివ భార్యభర్తలు. 2015లో వీరి ప్రేమ వివాహం జరగింది. వీరికి ఇద్దరు సంతానం. కొంత కాలంగా శివ ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నాడు. ఈ క్రమంలో తెలిసిన వారి వద్ద అప్పులు చేయడంతో వారు తిరిగి చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నారు. గురువారం ఉదయం శివ భార్య, పిల్లలను బీసెంట్ రోడ్డులో దింపి ఇంటికి వెళ్తున్నానని చెప్పాడు. సాయంత్రం 4 గంటల సమయంలో ఇంటికి వచ్చిన ఆయేషాకు భర్త కనిపించకపోవడంతో తెలిసిన వారిని ఆరా తీసింది. ప్రయోజనం లేకపోవడంతో ఆందోళన చెందిన కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేసింది.

మరో ఘటనలో..

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): తండ్రి అదృశ్యం కావడంతో కుమారుడు కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా గురువారం కేసు నమోదు చేశారు. బ్రహ్మంగారి మఠంకు చెందిన బైరెడ్డి విద్యాసాగర్ చేపల మార్కెట్ వద్ద మెడికల్ షాపు నిర్వహిస్తుంటాడు. అతని తండ్రి సింహాచలం (70), తల్లి పద్మావతి కొడుకు వద్దే ఉంటారు. ఈ నెల 23వ తేదీ సింహాచలానికి భార్యతో చిన్న గొడవ జరగడంతో బయటకు వెళ్లి వస్తానని చెప్పాడు. సాయంత్రమైతనా తండ్రి తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన విద్యాసాగర్ తన తమ్ముడు, చెల్లెలను ఆరా తీసినా ఫలితం లేదు. తండ్రి కనిపించడం లేదంటూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సినిమా థియేటర్‌లో పని చేస్తున్న యువతి అదృశ్యమైన ఘటనపై భవానీపురం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గొల్లపూడి యార్డ్ రోడ్డుకు చెందిన ఓ యువతి రెండేళ్ల క్రితం ఇంటర్ మొదటి సంవత్సరం పూర్తి చేసింది. మూడు నెలల క్రితం స్థానిక థియేటర్‌లో బుకింగ్ ఆపరేటర్‌గా చేరింది. ఈనెల 27వ తేదీ ఉదయం 10 గంటల ప్రాంతంలో డ్యూటీకి అని చెప్పి ఇంటినుంచి వెళ్లింది. మధ్యాహ్నం 3 గంటలకు ఇంటికి వెళుతున్నానని థియేటర్‌లో చెప్పి వెళ్లిపోయింది. తిరిగి ఇంటికి రాలేదు. యువతి తల్లి అన్నపూర్ణ, థియేటర్ మేనేజర్.. ఆమె కోసం అన్వేషించినా ఆచూకీ తెలియలేదు. దీనిపై యువతి తల్లి అన్నపూర్ణ భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేసింది. థియేటర్‌లో పని చేసే సుధీర్ సాయి అనే యువకుడిపై అనుమానం వ్యక్తం చేస్తూ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆమె ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు.

విశ్వకర్మ యోజనను వినియోగించుకోండి

బీసీ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరి

భవానీపురం(విజయవాడపశ్చిమ): కేంద్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన పీఎం విశ్వకర్మ యోజనను చేతి వృత్తిదారులు వినియోగించుకుని ఆర్థికంగా ఎదగాలని బీసీ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి అల్లి వెంకటేశ్వరి అన్నారు. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలం గొల్లపూడి పరిధిలోని బీసీ సంక్షేమ భవన్‌లో గురువారం వెంకటేశ్వరి ఆధ్వర్యాన జరిగిన విశ్వకర్మ యోజన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ సౌజన్యంతో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే ఈ పథకం ద్వారా వివిధ వృత్తుల్లో ఐదు రోజుల పాటు శిక్షణ ఇస్తారని చెప్పారు. శిక్షణ పూర్తయిన తర్వాత సర్టిఫికెట్ అందచేయడమే కాకుండా బ్యాంక్‌ల ద్వారా రూ.15 వేల నుంచి రూ.3 లక్షల వరకు రుణ సౌకర్యం కల్పిస్తారని తెలియ చేశారు. ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్ మాట్లాడుతూ విశ్వకర్మ యోజనలో శిక్షణ పొందిన చేతి వృత్తిదారులు తయారు చేసిన ఉత్పత్తులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మార్కెటింగ్ చేసి వారి ఉపాధి కల్పనకు సహకరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో జాతీయ బీసీ సంఘం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షురాలు ముందూరు సత్యవతి, విశ్వబ్రాహ్మణ మహిళా సంఘం నాయకురాలు సుతారి నవత, కలికోట విజయలక్ష్మి, విజయవాడ విశ్వబ్రాహ్మణ యువజన విభాగం అధ్యక్షులు చిట్టూరి హరీష్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తోలేటి శ్రీకాంత్‌ను వెంకటేశ్వరి సత్కరించారు.



టూరిజం 'బెస్ట్ చెఫ్'గా కుమారస్వామి



భవానీపురం(విజయవాడపశ్చిమ): ఏపీటీడీసీ విజయవాడ డివిజన్ పరిధిలో బెస్ట్ చెఫ్‌గా భవానీపురానికి చెందిన కుమారస్వామికి ఎక్స్‌లెన్స్ అవార్డ్ లభించింది. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఈ నెల 27న తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన వేడుకల్లో పర్యాటక శాఖ మంత్రి రోజా చేతుల మీదుగా ఆయన అవార్డ్‌ను అందుకున్నారు. హరిత బరంపార్క్ (పున్నమి హోటల్)లో రెండు దశాబ్దాలకుపైగా హెడ్ కుక్‌గా చేస్తున్న కుమారస్వామి పున్నమి హోటల్‌లో జరిగే ఫంక్షన్లకు రుచికరమైన వంటకాలను తయారు చేసి మన్ననలను పొందారు. పర్యాటక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రజతభార్గవ, ఎండీ/సీఈఓ కన్నబాబు, కలెక్టర్ ఢిల్లీరావు, డీపీఎం సీహెచ్ శ్రీనివాసరావు అభినందించారు.

విశ్వశాంతిని కాంక్షించే ఇస్లాం

మిలాద్–ఉన్–నబీ సందర్భంగా నగరంలో ప్రదర్శన

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విశ్వశాంతిని కాంక్షించేదే నిజమైన ఇస్లాం అని పలువురు ఇస్లాం మత గురువులు పేర్కొన్నారు. మిలాద్–ఉన్–నబీ పర్వదినం పురస్కరించుకొని ఈద్ మిలాద్–ఉన్–నబీ కమిటీ ఆధ్వర్యంలో గురువారం పాతబస్తీలో భారీ ప్రదర్శన నిర్వహించారు. స్థానిక వించిపేట మసీదు సెంటర్ నుంచి కెనాల్‌రోడ్డులోని జామా మసీదు వరకూ భారీ ప్రదర్శన కొనసాగింది. కమిటీ అధ్యక్షులు సయ్యద్ సలీముద్దీన్ నేతృత్వంలో ప్రారంభమైన ప్రదర్శనలో నగరం నలుమూలల నుంచి భారీగా ముస్లింలు తరలివచ్చారు. ఇస్లాం మత చిహ్నాలను, కట్టడాల నమూనాలను ప్రదర్శిస్తూ ముస్లిం యువత ప్రదర్శనలో పాల్గొంది. ఇస్లాం మత చిహ్నాలతో కూడిన పతకాలను సైతం చేతబూని ఉత్సాహంగా వారు ప్రదర్శనలో ముందుకు సాగారు.

ఉత్తరప్రదేశ్‌కు చెందిన మత గురువు మనస్‌రజా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తోటి మానవుల శ్రేయస్సును కాంక్షించాలన్నారు. కమిటీ అధ్యక్షులు సయ్యద్ సలీముద్దీన్ మాట్లాడుతూ చిట్టచివరి దైవ ప్రవక్త బోధనలను అందరూ ఆచరించాలన్నారు. కార్యక్రమంలో వివిధ పార్టీల ప్రముఖులు పాల్గొన్నారు. జామా మసీదు ప్రాంగణంలో ఉన్న ప్రవక్త కేశాన్ని దర్శించుకొని ముస్లిం సోదరులు వెనుదిరిగారు.



వన్‌టౌన్‌లో జరిగిన ప్రదర్శనలో ముస్లింలు

సీఎం పర్యటనకు విస్తృత బందోబస్తు ఏర్పాట్లు

డీసీపీ విశాల్‌గున్ని

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): విద్యాధరపురం ఆర్టీసీ డిపో సమీపంలోని మినీ స్టేడియంలో శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనున్న ఐదో విడత వైఎస్సార్ వాహన మిత్ర పథకం విడుదల కార్యక్రమాన్ని ప్రారంభించడానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రానుండటంతో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేశారు. గురువారం సభా ప్రాంతంలో పోలీసు అధికారులు, సిబ్బందితో డీసీపీ సమావేశమై బందోబస్తు విధులపై మార్గదర్శకాలు, సూచనలు చేశారు.

ఆయన మాట్లాడుతూ సీఎం హాజరయ్యే కార్యక్రమానికి సభా ప్రదేశం, పరిసర ప్రాంతాల్లో 1200 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో కట్టుదిట్టమైన భద్రత, బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రముఖులకు, ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని, అప్రమత్తంగా విధులు నిర్వహించాలని, సమన్వయంతో పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎస్బీ ఏడీసీపీ జీవీ రమణమూర్తి, ట్రాఫిక్ ఏడీసీపీ డి.ప్రసాద్, పశ్చిమ ఏసీపీ కె.హనుమంతరావు, ట్రాఫిక్ ఏసీపీ రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



పోలీసు అధికారులు, సిబ్బందితో సమావేశమైన డీసీపీ విశాల్‌గున్ని

బీసీలందరూ సీఎం జగన్‌కు రుణపడి ఉంటారు

ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ పెంద్ర వీరన్న



భవానీపురం(విజయవాడపశ్చిమ): జనగణనలో బీసీ కులగణన చేయాలని అసెంబ్లీలో తీర్మానం చేయడంపై బీసీలందరూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటారని మోస్ట్ బ్యాక్‌వర్డ్ క్లాస్ (ఎంబీసీ) కార్పొరేషన్ చైర్మన్ పెంద్ర వీరన్న అన్నారు. గొల్లపూడిలోని బీసీ సంక్షేమ భవన్‌లో ఆయన చాంబర్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 26న జరిగిన ఏపీ శాసనసభ సమావేశాల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ బీసీ కులగణన చేయాలని తీర్మానం చేసి కేంద్రానికి పంపించడం శుభపరిణామమని తెలిపారు. దేశంలోనే మొట్టమొదటి సారిగా పూర్తి స్థాయిలో బీసీ కుల గణన జరగాలన్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనలకు త్వరలోనే ఒక రూపం రాబోతుందన్నారు. ఎంబీసీ కార్పొరేషన్, సంచార జాతుల సంఘం తరుపున సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి చెల్లుబోయినకు కృతజ్ఞతలు తెలిపారు.

భర్త వేధింపులపై ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): భార్యను వేధిస్తున్న భర్తపై కొత్తపేట పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. జక్కంపూడి కాలనీ బ్లాక్ నెం 53లో కటారి రాజేశ్వరి, గోపి నివసిస్తున్నారు. వీరిది ప్రేమ వివాహం. గోపి సీలింగ్ పనులు చేస్తుంటాడు. కొంత కాలంగా గోపి మద్యానికి బానిసై భార్యను వేధిస్తున్నాడు. 27వ తేదీ రాత్రి ఇంటికి వచ్చిన గోపి భార్యను కొట్టసాగాడు. దీంతో రాజేశ్వరి తల్లి అడ్డు రాగా ఆమెను కొట్టాడు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.